FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM
AMMA NEWS
డిజిటల్
శనివారం
11. 05. 2024



ఆదివాసీ మహిళకే

# అందలం..

## హస్తం గెలుపు నల్లేరుపై నడకేనా..?

ఆత్రం సుగుణకే అందరి మద్దతు..!..
బీజేపీ అభ్యర్థి గొడెం నగేష్‌పై వ్యతిరేకత

సొంత పార్టీలోనే సన్నగిల్లిన ఉత్సాహం..

కాంగ్రెస్ పార్టీకి అదే పెద్ద ప్లస్ పాయింట్

క్యాడర్ లేక చతికిల బడిపోయిన బీఆర్ఎస్..

ఈ నెల 13న పోలింగ్, జూన్ 6న తేలనున్న భవితవ్యం

# ఆత్రం సుగుణ వైపే మొగ్గు



## ఆదిలాబాద్ పై ఫైనల్ సర్వే రిపోర్ట్

### కాంగ్రెస్ దే గెలుపంటున్న సర్వే నివేదికలు

### 75 ఏళ్ళ చరిత్రలో మహిళకు తొలిగెలుపు దక్కుతుందంటున్న సర్వేలు

ఆదిలాబాద్ లో గెలుపెవరది? ఆదిలాబాద్ సెంటిమెంట్ ప్రకారం ఒక్కో ఎన్నికలో ఒక్కో పార్టీ ఎంపీ అభ్యర్థిని ఎన్నుకుంటారు? ఈ ఎన్నికల్లోనూ అదే సెంటిమెంట్ రిపీట్ అవుతుందని ఫైనల్ సర్వే తేల్చిచెబుతోంది. ఆదిలాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో ఆత్రం సుగుణ గెలుపుబాటలో దూసుకుపోతున్నదని సర్వేలు కుండబద్దలు కొడుతున్నాయి. ఫైనల్ సర్వే రిపోర్ట్ లో కాంగ్రెస్ 45శాతం ఓటింగ్ సాధించనుండగా, బిజెపి 27.16, బీఆర్ఎస్ 25.84 శాతం ఓట్లు సాధించనున్నట్లు ఫైనల్ కాన్ఫిడెన్షియల్ సర్వేలో పేర్కొన్నట్లు తెలిసింది. 75 ఏళ్ళ చరిత్రలో తొలిసారి ఆదిలాబాద్ ఎంపీగా ఓ మహిళ ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయని సర్వేలు తేల్చిచెబుతున్నాయి. ఇక గతంలో ప్రముఖ జర్నలిస్ట్ రవిప్రకాష్ ఆర్టీవి స్టడీ రిపోర్ట్ లో ఆత్రం సుగుణ గెలవబోతున్నదని ప్రకటించింది. టుడే చాణక్య, ఇన్ సైట్, పబ్లిక్ ఓట్ పల్స్, మనంటీవీ తదితర సంస్థలు నిర్వహించిన సర్వేలలో ఆదిలాబాద్ లో కాంగ్రెస్ మొగ్గును చూపాయి. మంత్రి సీతక్క వ్యూహాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్, కాంగ్రెస్ ను విజయతీరాలకు చేరుస్తున్నాయి. ఇక్కడ బిజెపి అభ్యర్థి మార్పు కాంగ్రెస్ కు కలిసొచ్చింది.

అమ్మన్యూస్ ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

# ఆదివాసీ మహిళకే అందలం..

## హస్తం గెలుపు నల్లేరుపై నడకేనా..?

**ఆత్రం సుగుణకే అందరి మద్దతు..!.. బీజేపీ అభ్యర్థి గొడెం నగేష్‌పై వ్యతిరేకత**

**సొంత పార్టీలోనే సన్నగిల్లిన ఉత్సాహం.. కాంగ్రెస్ పార్టీకి అదే పెద్ద ప్లస్ పాయింట్**

**క్యాడర్ లేక చతికిల బడిపోయిన బీఆర్ఎస్.. ఈ నెల 13న పోలింగ్, జూన్ 6న తేలనున్న భవితవ్యం**







**ఆదిలాబాద్ అమ్మన్యూస్ ప్రతినిధి:** 75 ఏళ్ల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా మహిళకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. సముచిత స్థానం కల్పించలేదు. కానీ మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అడుగు ముందుకేసి ఆదివాసీ మహిళకు ఎంపీ టికెట్ కేటాయించింది. ఎంతో మంది ఆశావహులను, సీనియర్ నేతలను కాదని ఓ సామాన్య ఉపాధ్యాయురాలైన ఆత్రం సుగుణను ఎంపిక చేసింది. అందుకే ఈసారి ఓటర్లు సైతం ఆమె వైపే మొగ్గుచూపుతున్నారు. మహిళను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే అందరి కష్టసుఖాలు తెలిసిన మనిషిగా. .ప్రజలగొంతుకగా తనవాణిని బలంగా వినిపిస్తారనే విశ్వాసంతో..నమ్మకంతో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. ఆమెను అందలమెక్కించాలనే కృతనిశ్చయంతో, ధృడమైన సంకల్పంతో ఉమ్మడి జిల్లా ఓటర్లు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఒక్కసారి అవకాశం ఇచ్చి చూద్దామని, గతంలో ఇద్దరు నేతల పనితీరును తెలిసిందేనని, ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నట్టుగా ఓటర్ నాడిని బట్టి అర్థమవుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నాలుగు స్థానాలను బీజేపీ కైవసం చేసుకుని బలమైన శక్తిగా ఎదిగింది. అప్పటివరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేవలం రెండు స్థానాల్లో విజయం సాధించింది. కేవలం ఒకే ఒక్క స్థానంపై కాంగ్రెస్ జెండా ఎగరేసినప్పటికీ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టి ఈ ప్రాంతంలో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. గతంలో ఎన్నడూలేని విధంగా హస్తం పార్టీలోకి ముఖ్య నేతలతోపాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వలసలు కట్టడంతో పార్టీ మరింత బలోపేతంగా మారుతోంది. పార్లమెంట్ ఎన్నికల వేళ చేరికలు ఊపందుకోవడంతో ఇక ఆ పార్టీకి తిరుగు లేదని సంకేతం ప్రజల్లోకి వెళ్లిపోయింది. అన్నీ అంశాలను అనుకూలంగా మలుచుకుని కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహాలతో ముందుకుసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ ఆదిలాబాద్ ఎంపీ స్థానంపై ప్రత్యేక దృష్టిసారించారు. అందులో భాగంగానే ముఖ్యనేతలను పార్టీలోకి రప్పించడంలో సఫలీ కృతమయ్యారనే వాదన వినబడుతోంది.

### అంతర్గత విభేదాలతో బీజేపీ కుదేలు

ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్‌ను సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు కాకుండా బీఆర్ఎస్ నుంచి వచ్చిన గొడెం నగేష్‌కు కట్టబెట్టడంతోనే ఆ పార్టీలో అంతర్గత విభేదాలకు కారణమైంది. అప్పటివరకు సఖ్యతగా ఉన్న ఆ పార్టీలో ఎవరికివారే యమునా తీరే అన్నట్టుగా పరిస్థితులు మారిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల్లో శ్రేణులు కనబర్చిన ఉత్సాహం ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కన్పించకపోవడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ముఖ్యంగా గొడెం నగేష్‌కు ఏకపక్షంగా టికెట్ కేటాయించడం పట్ల సీనియర్లంతా సైలెంట్ మూడ్‌లోకి వెళ్లి ఎక్కడా ప్రచారంలో తారసపడకపోవడం పార్టీ శ్రేణులను మరింత నిరుత్సాహానికి గురిచేసిందని చెప్పాలి.

ఇదిలా ఉండగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మినహా నిర్మల్, ముథోల్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యేలెవరూ నగేష్‌కు మద్దతుగా పూర్తిస్థాయి ప్రచారంలో పాల్గొనలేదనే చర్చ సాగుతోంది. అదే ఇప్పుడు ఆయన గెలుపుపై తీవ్ర ప్రభావం చూపబోతోందనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలోనే ఆదిలాబాద్ సెగ్మెంట్ పరిధిలో మాత్రమే గొడెం నగేశ్ ప్రచారం కొనసాగింది. మిగతా మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రం ఎన్నికల సందడి ఎక్కడా కనిపించలేదని పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. ఇతర పార్టీలకంటే ముందుగానే బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించిన ప్పటికీ పూర్తిస్థాయిలో ప్రచారం చేపట్టకపోవడానికి పార్టీలో నెలకొన్న విభేదాలే కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో నేతలందరినీ సమన్వయం చేయడంలో కొత్తగా వచ్చిన నగేష్ విఫలం చెందారని, అదే ఇప్పుడు ఆయన కొంపముంచే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### గడ్డు పరిస్థితుల్లో బీఆర్ఎస్

రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మారడంతో జిల్లాలో ఆ పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా, అగమ్యగోచరంగా తయారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌లో ఉన్న ప్రజాప్రతినిధులు, కేడర్ మొత్తం కాంగ్రెస్, బీజేపీలోకి వలస కట్టారు. నిర్మల్‌లో మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి రావడంతో సీన్ మొత్తం మారిపోయింది. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, కోనేరు కోనప్ప, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, విజయడెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి వంటి సీనియర్లంతా పార్టీ మారడంతో బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఆ పార్టీ తరపున పార్లమెంట్ బరిలో ఆత్రం సక్కును నిలిపినప్పటికీ పెద్దగా ప్రచారం చేయకపోవడం, కేవలం ఆదిలాబాద్ సెగ్మెంట్‌కే పరిమితం కావడం, బలమైన క్యాడరంతా ఇతర పార్టీల్లోకి జంప్ కావడంతో ఆ పార్టీలో జోష్ లేకుండా పోయింది. కేవలం బీఆర్ఎస్ తన ఉనికి కాపాడుకునేందుకే శ్రమించాల్సి వస్తోంది. ఒకవేళ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతే పూర్తి స్థాయిలో తుడిచిపెట్టుకుపోవడం ఖాయమనే చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. మొత్తానికైతే మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఆత్రం సుగుణకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇవాల్టితో ప్రచారానికి అయితే తెరపడింది. మరీ ఓటర్లు ఎవరికీ పట్టం కడతారో..ఎవరిని అందలమెక్కిస్తారో తెలియాలంటే జూన్ 6వ తేదీ వరకు వేచి చూడక తప్పదు.

### సుగుణకు కలిసొచ్చే అంశాలు ఇవే...

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు చాలా అంశాలు కలిసొస్తున్నాయి. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి ఎంపీ బరిలో నిలిచిన మొదటి మహిళ కావడం ఒకటైతే.ఆదివాసీ పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం, అందరితో కలుపుగోలుగా మాట్లాడే మనస్థత్వం,ఆదివాసీ హక్కులకై పోరాటం చేసిన ఉద్యమనాయకురాలు ,అధిష్టాన పెద్దల అండదండలు మెండుగా ఉండడం, మైనార్టీవర్గం మొత్తం వన్‌సైడ్ సపోర్టు చేయడం, మహిళ ఓటర్లు అధికంగా ఉండడం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుంటే ఆమె గెలుపు నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్నివర్గాల ప్రజలు ఒక్కసారి అవకాశం ఇవ్వాలనే భావిస్తున్నట్టుగా ఓటరు నాడిని బట్టి అర్థమవుతోంది. ఎక్కడా చూసినా కాంగ్రెస్ విజయం ఖాయమనే ప్రచారం ఊపందుకుంది. ఆదివాసీల తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం కలిగిన లంబాడాలు సైతం ఆదివాసీ మహిళా అభ్యర్థిగా రంగంలోకి దిగిన ఆత్రం సుగుణకే మద్దతు తెలపాలని మెజార్టీ ఓటర్లు యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది.


# ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో చేరికల వెల్లువ

## నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో జాయినింగ్స్

**కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరికలు**

**కండువాలు కప్పి ఆహ్వానం పలికిన కంది శ్రీనివాసరెడ్డి**

**కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు**




**అమ్మ న్యూస్ ప్రతినిధిఆదిలాబాద్ :** కాంగ్రెస్‌లో చేరికల పరంపర కొనసాగుతోంది.ఎన్నడూలేని విధంగా పార్టీ కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో బలోపేతంగా తయారవుతోంది. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, కంది శ్రీనివాసరెడ్డి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలతో పలువురు ఆకర్షితులై కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు.ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి బీఆర్ఎస్ ఎంపీటీసీ మడవి కిసాన్,వార్డు సభ్యులు కొప్పుల సతీష్, యూత్ అధ్యక్షులు సయ్యద్ ఆఫ్సర్ తో పాటు బీఆర్ఎస్, బీజేపీ ల నుండి నోముల చంద్రకాంత్ రెడ్డి,బరుగు గంగన్న ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.అలాగే పట్టణంలోని 48వవార్డు లోని భుక్తాపూర్ కాలనీ నుండి జ్యోతి ఆధ్వర్యంలో మహిళలతో పాటు ఆదిలాబాద్ రూరల్ మండలం పార్డి - బీ గ్రామస్థులు ,బేలా మండల మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే ఆధ్వర్యంలో మొహబ్బత్ పూర్ గ్రామస్తులు కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. సర్వేలన్నీ మనకు అనుకూలంగా ఉన్నాయని ఆత్రం సుగుణక్క బంపర్ మెజార్టీతో గెలవడం ఖామమని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. అయినా ఈ మూడు రోజులు చాలా కీలకమని నాయకులు కార్యకర్తలు ఎవరుకూడా తమతమ గ్రామాలలోనే ఉండి కాంగ్రెస్ గెలుపు బాధ్యతను భుజానికెత్తుకోవాలని పిలుపునిచ్చారు. రేవంతన్న నేతృత్వంలో మన గ్రామాలన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు.బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్ తీసేస్తామంటోందని అందుకే పాత కొత్త నాయకులందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి - వెంకట్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్,లోక ప్రవీణ్ రెడ్డి,బాయిన్ వార్ గంగా రెడ్డి,నల్ల గణపతి రెడ్డి,యాల్ల పోతా రెడ్డి,తమ్మల చందు, నలగంటి నవీన్,తల్లెల రాకేష్,సుధాగోని సుధాకర్ గౌడ్,రఫీక్,శంకర్ భోక్రే,కయ్యుమ్, రమేష్, నయాన్ షాహిద్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.







FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM
AMMA NEWS
డిజిటల్
శనివారం
11. 05. 2024



## మాకే ఎక్కువ సీట్లు

**ప్రెస్ మీట్ లో కేసీఆర్**

**17 రోజుల బస్సు యాత్ర తర్వాత జనస్పందన ఇదే**

4లో..



## గెలిచేది మనమే

**పటాన్ చెరులో రేవంత్ రోడ్ షో సూపర్ హిట్**

**పక్కాగా 14 గెలుస్తున్నాం**

4లో..



## ప్రచారం బంద్

**పోలింగ్ పై నజర్**

**మూగబోయిన మైకులు**

4లో..



## రేవంత్ తమాషా

**నా వీడియోనే మార్ఫింగ్ చేశారు**

**అమిత్ షా ధ్వజం**

4లో..



## కడపలో రాహుల్

**సోదరి షర్మిలను గెలిపించాలని పిలుపు**

**వైఎస్సార్ పేరు ఛార్జ్ షీట్ లో మేం చేర్చలేదు**

4లో..

# భువనగిరి కిరణ్‌దే

## ఫైనల్ సర్వే రిపోర్ట్



**57.81శాతం ఓట్లు సాధిస్తాడని లేటేస్ట్ రిపోర్ట్**

**కాంగ్రెస్‌కు భారీ ఆధిక్య సంకేతాలు**

**కలిసొచ్చిన రేవంత్, కోమటిరెడ్డి బ్రదర్స్ ఖలేజా**

**భువనగిరిలో ట్రిపుల్ ఆర్ వేవ్**

**బిజెపికి క్యాడర్ లేమి..**

**బీఆర్ఎస్‌కు క్యాడర్ ఉన్నా లీడర్ లేడు**

**ఫైనల్‌గా చామలకిరణ్‌దే గెలుపుబాట**

**ఇదీ సర్వేల మాట**

2లో..

ఒక్కో నియోజకవర్గంలో.. ఒక్కో వేవ్. భువనగిరి లోక్ సభలో గెలుపు ఎవరిది? కంచుకోటను కాంగ్రెస్ నిలుపుకుంటుందా? బలమైన క్యాడర్ ఉన్న బీఆర్ఎస్ సత్తా చాటుతుందా? బీజెపి కమలం వికసిస్తుందా? అన్న చర్చలు సర్వత్రా ఉన్న వేళ ఫైనల్ సర్వే రిపోర్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ ఫైనల్ సర్వే రిపోర్ట్ లో అనేక సంచలనాలు ఉన్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం కాదు.. సునామీనే సృష్టించబోతున్నదని ఈ సర్వే చెబుతోంది. ఈ కాన్ఫిడెన్షియల్ సర్వేలో కాంగ్రెస్ కు 57.81శాతం ఓట్లు రావడం ఖాయమని తేలింది.

అమ్మన్యూస్ ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్



# భువనగిరి కిరణ్‌దే

## ఫైనల్ సర్వే రిపోర్ట్.. 57.81శాతం ఓట్లు సాధిస్తాడని లేటెస్ట్ రిపోర్ట్



**(అమ్మన్యూస్ ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్):** ఒక్కో నియోజకవర్గంలో.. ఒక్కో వేవ్. భువనగిరి లోక్ సభలో గెలుపు ఎవరిది? కంచుకోటను కాంగ్రెస్ నిలుపుకుంటుందా? బలమైన క్యాడర్ ఉన్న బీఆర్ఎస్ సత్తా చాటుతుందా? బీజెపి కమలం వికసిస్తుందా? అన్న చర్చలు సర్వత్రా ఉన్న వేళ ఫైనల్ సర్వే రిపోర్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ ఫైనల్ సర్వే రిపోర్ట్ లో అనేక సంచలనాలు ఉన్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం కాదు.. సునామీనే సృష్టించబోతున్నదని ఈ సర్వే చెబుతోంది. ఈ కాన్ఫిడెన్షియల్ సర్వేలో కాంగ్రెస్ కు 57.81శాతం ఓట్లు రావడం ఖామని తేలింది. ఈ లెక్క ప్రకారం యాదవ సామాజికవర్గంలో బీఆర్ఎస్ తన పట్టును చూపుతుండడంతో 23.55 శాతం ఓట్లు సాధించనన్నట్లు ఈ సర్వే చెబుతోంది. మే 3నుండి 7 వరకు ఈ సర్వే జరిపినట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ 47.92 శాతం ఓట్లు సాధించనుండగా, నకిరేకల్ నియోజకవర్గంలో అత్యధికంగా 68.79శాతం ఓట్లు దక్కనుందని సర్వే పేర్కొంది. తుంగతుర్తిలో 62.19శాతం, మునుగోడులో 61.48శాతం , ఆలేరులో 55.75శాతం, జనగామలో 50.68శాతం ఓట్లు దక్కనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ కు జనగామలో అత్యధికంగా 31.51శాతం ఓట్లు దక్కనుండగా, బిజెపికి ఇబ్రహీంపట్నంలో 25.45శాతం ఓట్లు దక్కనున్నట్లు ఈ సర్వే పేర్కొంది. మొత్తంగా భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజారిటీతో గెలవబోతున్నదని స్పష్టమైన వాతావరణం కనబడుతున్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రాబల్యమే ప్రధాన విజయసోపానం కాగా, ఎమ్మెల్యేలు కలిసిరావడం.. అభ్యర్థి చామల కిరణ్ సీఎం రేవంత్ సన్నిహితుడు కావడం, యువతలో క్రేజ్ ఉండడం కలిసొచ్చే పరిణామాలుగా పేర్కొంటున్నారు. అవే భారీ మెజారిటీని అందించబోతున్నట్లు తెలుస్తోంది.

# గెలిచేది మనమే

## పటాన్ చెరులో రేవంత్ రోడ్ షో సూపర్ హిట్



**అమ్మన్యూస్, మెదక్:** ఈ ఎన్నికలు రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికన జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికలు సంక్షేమం, అభివృద్ధి ప్రాతిపదికన జరగడం లేదని వ్యాఖ్యానించారు. శనివారం మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా పటాన్ చెరులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆ సందర్భంగా మాట్లాడిన ఆయన.. మతాల మధ్య, మనుషుల మధ్య చిచ్చు పెట్టి కత్తులతో పొడుచుకునేలా బీజేపీ కుట్రలు చేస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. నీలం మధు, కాటా శ్రీనివాస్‌లు రామ లక్ష్మణుల్లా కలిసి పని చేయండని, వారి రాజకీయ భవిష్యత్‌కు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పటాన్ చెరు ప్రాంతం ఒక మినీ ఇండియా అన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా ఇక్కడి ప్రజలు కలిసి ఉంటారని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే నీలం మధు ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మెదక్ అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఇప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనదే అంటూ హామీ ఇచ్చారు. మొన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు ఎంపీగా ఉన్నారని, వాళ్లు మెదక్ ప్రాంతానికి, ఇక్కడి ప్రజలకు ఏం చేశారో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. మెదక్ జిల్లా రైతులను ముంచి పోలీసులతో కొట్టించిన దుర్మార్గుడు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అంటూ విరుచుకుపడ్డారు. వేల కోట్లు సంపాదించుకున్న ఆయన.. కేసీఆర్, హరీష్ రావులకు రూ. వందల కోట్లు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారని దుయ్యబట్టారు.

**లక్ష మెజారిటీతో నీలం మధును గెలిపించాలి..**

ఎమ్మెల్సీగా కొనసాగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఇప్పుడు ఎంపీగా పోటీ చేస్తున్నారని, పెగ్గు మీద పెగ్గు వేసినట్టు కుర్చీ మీద కుర్చీ వేసుకుంటారా అంటూ కామెంట్స్ చేశారు. రాష్ట్రానికి వచ్చిన మోడీ, అమిత్ షాలు రామచంద్రపురం వరకు మెట్రో విస్తరణకు నిధులు ఇస్తామని చెప్తారనుకున్నామని గుర్తు చేశారు. మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధికి నిధులు ఇస్తారనుకున్నామని, బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి ప్రస్తావిస్తారనుకున్నాంమని, కానీ ఇవేవీ ఇవ్వకుండా హిందూ, ముస్లింల మధ్య కొట్లాట పెట్టాలని ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు కత్తులతో పొడుచుకుని రక్తం చిందించాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇందిరమ్మ గెలిచిన మెదక్ నుంచి నీలం మధును బరిలోకిదించామని, రిజర్వేషన్లు కాపాడలంటే కాంగ్రెస్‌కు అండగా ఉండాలని, ఈ ఎన్నికల్లో నీలం మధును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# కడపలో రాహుల్

## వైఎస్ఆర్ దేశానికే మార్గదర్శకం.. పేదలు, న్యాయం కోసమే ఆయన రాజకీయం

## భారత్ జోడో యాత్రకు వైఎస్ పాదయాత్రే ఆదర్శం.. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్

### కడప సభలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



**అమ్మన్యూస్, కడప:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దేశానికి మార్గదర్శకులని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనియాడారు. శనివారం కడపలో వైఎస్ షర్మిలకు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నా భారత్ జోడో యాత్రకు వైఎస్ పాదయాత్రే మార్గదర్శమన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకోవచ్చాని వైఎస్ చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రానికి కాదు.. దేశానికి మార్గదర్శకంగా నిలిచారని చెప్పారు. ఆయన ఆలోచన విధానం ఇప్పుడు ఏపీలో లేదన్నారు. ఏపీలో బీజేపీ బీ టీమ్ నడిపిస్తోందన్నారు. బీజేపీ అంటే జగన్, బాబు, పవన్ అంటూ వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయం కోసం, పేదల కోసం ఆయన రాజకీయం చేశారని ప్రశంసించారు. రాజశేఖర్ సిద్ధాంతం కాంగ్రెస్ సిద్ధాంతం అని, ఆయన ఎప్పుడు బీజేపీ వ్యతిరేకంగా పోరాడినట్లు తెలిపారు. కానీ జగన్ మాత్రం బీజేపీని ఎప్పుడు ప్రశ్నించలేదన్నారు. ఎందుకంటే జగన్ మీద కేసులు ఉన్నాయి కాబట్టి ప్రశ్నించరన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యిందా.. ఏపీకి ప్రత్యేక హోదా లభించిందా అని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ నిర్మించారా.. ఇవేవి జగన్ సర్కార్ తీరు వల్లే రాలేదని రాహుల్ గాంధీ విమర్శించారు.

# రేవంత్ తమాషా



**అమ్మన్యూస్, చేవెళ్ల:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఒక్క అవినీతి మరక కూడా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కొంచెం వేడి ఎక్కువ అయితే ఫారిన్ టూర్లకు వెళ్లే రాహుల్ గాంధీ అంటూ కామెంట్స్ చేశారు. శనివారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా వికారాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఓ వైపు, మరోవైపు ప్రధాని మోడీ అన్నారు. దీపావళి రోజు కూడా సెలవు తీసుకోని మోడీ ఓ వైపు ఎన్నికల్లో నిలబడ్డారన్నారు. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ కావాలో, ప్రధాని మోడీ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. సర్జికల్ స్ట్రైక్ చేసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమాషాగా మాట్లాడుతున్నారని చెప్పారు. దాని ద్వారా పాక్‌లోకి ప్రవేశించి ఉగ్రవాదులను ఏరిపారేశామన్నారు. పాక్ ఆక్రమిత ప్రాంతం భారత్ ఆధీనంలో ఉంటుందని, బీజేపీ ఉన్నంత వరకు పీవోకేను పాక్ వశం కాకుండా చూస్తోందని తెలిపారు. పాకిస్థాన్ దగ్గర ఆటమ్ బాంబ్ ఉందని కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ భయపెడుతున్నారని చెప్పారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని చెప్పారు. వారి దగ్గర ఆటమ్ బాంబ్ ఉందని పీవోకేను పాకిస్థాన్‌కు అప్పగిస్తామా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు కాశ్మీర్‌లో పని ఏమిటని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని, ఈ రాష్ట్ర ప్రజలు కశ్మీర్ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడుతారన్నారు. బీజేపీ 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు తీసేస్తామని రేవంత్ రెడ్డి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కశ్మీర్ మనదేనా, కదా.. తెలంగాణ ప్రజలు స్పష్టంగా చెప్పాలన్నారు. దేశంలో ఉగ్రవాదాన్ని పారద్రోలడానికి మోడీ కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఉగ్రవాదులను కాపాడుతూ వచ్చిందని దుయ్యబట్టారు. అయోధ్యలో రామమందిరం అంశాన్ని కాంగ్రెస్ 70 ఏళ్లుగా నాన్చుతూ వచ్చిందన్నారు. కానీ మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చి అయోధ్యలో రామమందిరం నిర్మించారని గుర్తు చేశారు. ఆలయ రామ మందిరం ప్రాణప్రతిష్ఠకు కూడా కాంగ్రెస్ నేతలు పాల్గొనలేదన్నారు. మజ్లిస్ ఓటు బ్యాంక్‌కు రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, వారి ఓటు బ్యాంక్ కోసం తాము ఎప్పుడూ భయపడలేదన్నారు. కాంగ్రెస్, మజ్లిస్‌ను తరిమే శక్తి బీజేపీకి మాత్రమే ఉందన్నారు. అలాగే బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే అంటూ అమిత్ షా దుయ్యబట్టారు.

# మాకే ఎక్కువ సీట్లు: కేసీఆర్

**అమ్మన్యూస్, హైదరాబాద్:** రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ దృష్టి పెట్టిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 17 రోజుల బస్సు యాత్ర చేపట్టానని గుర్తు చేశారు. ఆ తర్వాత జనం నుంచి వచ్చిన స్పందనలు, మధ్యాహ్నం సమయంలో జనం ఇచ్చిన సమాచారం ద్వారా ఈ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలను మించి ఎక్కువ స్థానాల్లో బీఆర్ఎస్ అద్భుతంగా గెలవబోతుందని ధీమాను వ్యక్తం చేశారు. ఇందులో సందేహం లేదన్నారు. ఈ రెండు ప్రభుత్వాల ఆచరణ, అవలంభించిన తప్పుడు విధానాలు ప్రజల్లోకి వెళ్లాయని, దాని ఫలితమే బీఆర్ఎస్ అద్భుతమైన విజయం సాధించబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నారని, వాళ్లు చేసిన తప్పిదాలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీని కాటేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్ కోతలు ప్రారంభమయ్యాని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్ చేశానన్నారు. న్యూయార్క్, లండన్‌లో కరెంట్ పోయినా.. హైదరాబాద్‌లో మాత్రం పోయేది కాదన్నారు. తొమ్మిదేళ్ల కరెంట్ ఎక్కడ పోయింది.. తాగు నీళ్లు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆర్థికకు హైదరాబాద్ వెన్నుముక అని, బీఆర్ఎస్ హయాంలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ హయాంలో పరిశ్రమలు తరలిపోతున్నయన్న వార్తలు వస్తున్నాయన్నారు. చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, శ్వేత పత్రాలు ప్రవేశ పెట్టి అక్కసు వెళ్లగక్కారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ అనుభవంతో చెబుతున్నానని, జాతీయ పార్టీల ఓటమి స్పష్టంగా కనిపిస్తోందని కేసీఆర్ కామెంట్స్ చేశారు.

# ప్రచారం బంద్

## పోలింగ్ పై నజర్.. మూగబోయిన మైకులు

**అమ్మన్యూస్, హైదరాబాద్ :** లోక్ సభ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. గడచిన 50 రోజులుగా హోరాహోరి పోరు సలిపిన పార్టీలన్నీ తెరవెనుక మంత్రానికి దారులు వెతుక్కుంటున్నాయి. మైకులు మూగబోవడంతో పాటు ప్రచార రథాలన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాలలో దాదాపు 525 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు హోరాహోరిగా తలపడుతున్నాయి. సై అంటే సై అన్నట్లుగా ప్రచారంలో అభ్యర్థులు, పార్టీల నేతలు సవాళ్ళు, ప్రతి సవాళ్ళను విసురుకున్నారు. అమీతీమీకి కూడా సిద్దమని ప్రజల ముందుకు వచ్చారు. చాలా నియోజకవర్గాలలో బీజేపీ, కాంగ్రెస్ లు ముఖాముఖిగా తలపడుతుండగా, కొన్ని నియోజకవర్గాలలో బీఆర్ఎస్ కు కూడా దూకుడుగా ప్రచారం చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాయంత్రంతో ప్రచారానికి తెరదించిన పార్టీలన్నీ తెరవెనుక రాజకీయాలకు శ్రీకారం చుట్టాయి. ప్రత్యర్థి పార్టీలకు చెందిన బలమైన నేతలు, కీలకమైన ఓటర్లపై దృష్టి పెట్టి వారిని ఆకర్షించే పనులను వేగవంతం చేశాయి.

**పోలింగ్ కు సర్వం సిద్ధం**

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లను దాదాపు పూర్తి చేసింది. రాష్ట్రంలో మొత్తం 35,809 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిల్లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధారణ పోలింగ్ స్టేషన్లంటూ ఏ,బీ,సీ లుగా వర్గీకరించి బందోబస్తు ఏర్పాట్లను చేపట్టింది. ఉదయం ఏడు గంటల సాయంత్రం 5 గంటల రకు పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఆయా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉండేలా ఆదేశాలను కూడా జారీ చేసింది.

# ‘రద్దు చేయడానికి రాజ్యాంగం మోడీ రాయలే’

ఆ ప్రయత్నాలకు గండికొడుదాం

పదేళ్లు బడా వ్యాపారుల కోసమే పని చేశారు

బడుగు బలహీన వర్గాలకు బీజేపీ ఏం చేసింది

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోంది

తాండూరు సభలో ప్రియాంక గాంధీ ఫైర్



**అమ్మన్యూస్, తాండూర్:** ఇందిరా గాంధీని ఆదరించిన నేల ఇది అంటూ ప్రియాంక గాంధీ ప్రసంగాన్ని ప్రారంభించారు. శనివారం చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన జన జాతర సభకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షీతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. సోనియా గాంధీని, సోనియమ్మ అని పిలిచి తల్లిపాత్రను ఇచ్చారని చెప్పారు. గత ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 500 గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని మార్చలనుకున్న ప్రయత్నాలకు ఇక్కడి నుంచే గండి కొట్టాలన్నారు. పదేళ్లు మోడీ సర్కార్ బడా వ్యాపారుల కోసమే పని చేసిందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం బీజేపీ ఏమీ చేయలేదని విమర్శించారు. ప్రధాని మోడీ మిత్రుల కోసం రూ. 16 లక్షల కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని అన్నారు. పేద రైతులు రూ. 50 వేల కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజల మధ్య చిచ్చులు పెట్టి.. లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. వాస్తవాలు తెలియకుండా మీడియాను మేనేజ్ చూస్తున్నారని దుయ్యబట్టారు. ధర్మం పేరిట ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రద్దు చేయడానికి రాజ్యాంగాన్ని మోడీ రాయలేదన్నారు. మన పూర్వీకులు ఎంతో కృషి చేసి బావితరాల కోసం రాశారన్నారు. 140 కోట్ల ప్రజలు ఆకాంక్షలు నెలవేర్చేది రాజ్యాంగం మాత్రమేనన్నారు. కాంగ్రెస్‌పై బీజేపీ ఎన్నో అబద్ధాలు చెప్తుతున్నారని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. బీజేపీకి కర్రు కాల్చి వాత పెట్టాల్సిందే: సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలు ఆలోచన చేసి తీర్పు ఇవ్వాలని కోరారు. వికారాబాద్‌కు కాంగ్రెస్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మనకు నీళ్లించేందుకు ప్రాణహిత చేవెళ్లను ఆనాడు మనమే చెప్పట్టామని.. పాలమూరు– రంగారెడ్డిని చేపట్టిందే కాంగ్రెస్ అని గుర్తు చేశారు. పాలమూరు ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. కేంద్రం నిర్లక్ష్యంతోనే మన జిల్లా వెనుకబడిందన్నారు. ఈ దుస్థితికి కారణం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అంటూ మండిపడ్డారు. మన జిల్లా అభివృద్ధి కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ గెలువాలని కోరారు. రైతు భరోసా కింద రూ. 750 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. సవాల్‌పైయ నిలబడే వ్యక్తి కేసీఆర్ అయితే ముక్కు నేలకు రాయాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుంటే తనకు ఈ ముఖ్యమంత్రి పదవి దండగన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి కర్రు కాల్చి వాత పెట్టాల్సిందేనని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలి

## బిజెపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలు

**చివరి రోజు హెూరెత్తిన ప్రచారం**

**ఎంపీ అభ్యర్థి తాండ్రను గెలిపించాలని పెద్ద ఎత్తున నినాదాలు**





**ఖమ్మం:** ఖమ్మం పార్లమెంట్ గడ్డపై బిజెపి జెండా ఎగరవేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులకు ఓట్లు వేశారని ఈ ఒక్కసారి బిజెపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో, మండలాల్లో , గ్రామాల్లో బిజెపి, టిడిపి, జనసేన, ఎంఆర్పిఎస్ సంయుక్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్ లో పార్టీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ గుర్తు అయిన కారు రిపేర్ కు వచ్చిందని దాన్ని ఖమ్మం మున్నేటిలో వెయ్యాలని పిలుపునిచ్చారు. భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే మరోసారి మోడీ ప్రధాని కావాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ అభ్యర్థి వినోద్ రావు మచ్చలేని వ్యక్తి. నీతి నిజాయితీ గల తాండ్రను ఖమ్మం అభ్యర్థిగా ప్రధానమంత్రి మోడీ గారు పంపించారని తెలిపారు. ఆయనకు ఓటు వేస్తే మీరు మోడీకి ఓటు వేసినట్లేనని చెప్పారు

# పిఠాపురంలో రాంచరణ్ ప్రచారం

## మెగా, పవర్ స్టార్ ఫ్యాన్స్‌తో సీక్రెట్ మీటింగ్!



**(అమ్మన్యూస్, హైదరాబాద్):** తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. ఎన్నికల ప్రచారానికి కొన్ని గంటల గడువు ఉండటంతో రాజకీయ పార్టీల నేతలంతా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో సినీ తారలు కూడా తమకు తోచిన విధంగా నచ్చిన పార్టీలకు మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో అందరి కన్ను పిఠాపురంపైనే పండింది. ఎందుకంటే అక్కడ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పోటీ చేస్తుండమే.. అయితే తన బాబాయ్‌కు మద్దతుగా తన తల్లి సురేఖ కొణిదెలతో కలిసి మెగా పవర్ స్టార్ రాంచరణ్ పిఠాపురానికి చేరుకొన్నారు. ఇక ప్రచారం సమయానికి ముగింపు దగ్గరపడుతుండటంతో మెగా పవర్ స్టార్ రాంచరణ్ పిఠాపురంలోని కుకుటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకొనేందుకు తన తల్లి సురేఖతో శనివారం ప్రత్యేక విమానంలో ఉదయం రాజమండ్రికి చేరుకొన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఆయన పిఠాపురం చేరుకొంటారు. రాజమండ్రి విమానాశ్రయంలో రాంచరణ్‌కు భారీ స్వాగతం లభించింది. మెగా అభిమానులు పోటేత్తారు. కుకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పార్థనలు చేసిన తర్వాత ఆయన తన అభిమానులు, మెగా, పవర్ స్టార్ అభిమానులతో సీక్రెట్‌గా భేటీ అయ్యే అవకాశం ఉంది. అనంతరం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకొంటారని ఆయన సన్నిహితులు, పీఆర్ వర్గాలు వెల్లడించాయి.



# బీసీల ముద్దుబిడ్డ కాసాని

## పార్లమెంట్‌కు పంపించి బహుజన వాణ్ని వినిపించండి

**అమ్మన్యూస్, చేవెళ్ల:** బీసీల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రధాన ఎజెండా అని, ఆ ఎజెండాను పార్లమెంట్‌లో ప్రస్థావించాలంటే చేవెళ్ల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపుడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని తమ తమ నియోజకవర్గాల్లో హెూరెత్తించిన ఇద్దరు నేతలు.. కాసాని గెలుపు కాంగ్రెస్ పార్టీకి మేలు కొల్పుగా అవుతుందన్నారు. అమలు కానీ హామీలను గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకపోగా, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెలవేర్చలేదని వారే ఆరోపించారు. గరీబీ హఠవో నినాదాన్ని నాడు ఇందిరా గాంధీ హెూరెత్తించిన పేదరిక నిర్మూలన మాత్రం జరగలేదన్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన కాసానికి చేవెళ్ల నియోజకవర్గం పైన ఇక్కడి ప్రజల స్థితిగతులపైన పూర్తి అవగాహన ఉందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే కాసానిని గెలిపించి, మరోసారి ప్రజా నాయకుడిగా చేవెళ్ల ప్రజలకు అండగా ఉండాలని వారు కోరారు.

# కొండాపై కాంగ్రెస్ కుట్రలు

## వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేసిన సంగీత రెడ్డి



**అమ్మన్యూస్, హైదరాబాద్ :** పోలింగ్ సమయం దగ్గర పడుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ కుట్రలకు తెరలేపిందని బీజేపీ ఆరోపించింది. చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎలాగైనా ఓడించేందుకు నీచ రాజకీయాలు మొదలు పెట్టిందని ఆ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇందులో భాగంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి కమలం పువ్వు గుర్తు ఈవీఎంపై రెండవ స్థానంలో ఉండగా నాలుగో స్థానంలోని కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఓటు వేయాలంటూ ఫేక్ న్యూస్ ను సోషల్ మీడియాలో రిలీజ్ చేసిందని ఆ పార్టీ పేర్కొంది. చేవెళ్ల ప్రజలను అయోమయానికి గురి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఫేక్ ప్రచారానికి తెరలేపిందని, ఈ విషయాన్ని గమనించిన బీజేపీ కాంగ్రెస్ కుట్రలపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేసింది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీత రెడ్డి స్వయంగా బి ఆర్ కే భవన్ కి వెళ్లి రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే అడ్డుకోవాలని, కుట్రకు కారణమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలో నిలిచిన నకిలీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అసలు ప్రచారంలో ఎక్కడా కనిపించలేదని, నిజమైన అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని దెబ్బతీయాలని కుట్రలో భాగంగానే ఈ తతంగం జరుగుతుందని ఆమె ఆరోపించారు. ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థికి అసలు ఎలక్షన్ కమిషన్ నాలుగవ స్థానాన్ని కూడా కేటాయించలేదని కొండా సంగీత రెడ్డి స్పష్టం చేశారు.